
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 8 అక్టోబరు 2025


గుంతలమయంగా కోట్‌పల్లి రోడ్డు

ధ్వంసమైన వంతెన

షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన ధ్వంసం కావడంతో సుమారు రూ.4 కోట్లు నష్టం వాటిల్లింది. కొందుర్గు మండలం తంగళ్లపల్లి - వెంకిర్యాల వంతెన కోసం చేపట్టిన పనులు వర్షాలకు పూర్తిగా దెబ్బతినడం వల్ల రూ.కోటి వరకు నష్టం వాటిల్లింది. కేశంపేట మండల పరిధిలో కొత్తపేట - కోనాయిపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కేశంపేట - చౌలపల్లి, లేమామిడి- నిడుదవెల్లి మధ్యంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారం నుంచి చౌదరిగూడ వరకు ఇటీవల నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డు వర్షానికి కోతకు గురైంది. జిల్లేడు నుంచి చౌదరిగూడకు వచ్చే సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. నందిగామ - చెగూరు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారిరాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డు వరకు దెబ్బతిన్నది.


వికారాబాద్ కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయుడు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/కీసర, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువు అని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రతి ఒక్కరు నిజాయతీ నిబద్ధతతో జీవించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, బీసీ వెల్ఫేర్‌అధికారి మాధవరెడ్డి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో..

మేడ్చల్ కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల శాఖ అధ్వర్యంలో మంగళవారం జరిగిన వేడుకల్లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జేఎల్‌బీ హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఝాన్సీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

తాండూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్(సీజేఐ) బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం ప్రజాస్వామ్యంలో దుర్దినంగా భావించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ న్యాయ అధికారుల గౌరవానికి భంగం కలిగే విధంగా ఎవరూ వ్యవహరించరాదని సూచించారు. కార్యక్రమంలో ఆమెతోపాటు నాయకులు అనంతయ్య, అబ్దుల్లా, ఏసు రత్నం ఉన్నారు.


మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని రోడ్లు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా చిన్న, పెద్ద రోడ్లన్నీ ఎటు చూసినా బురద గుంటలతో దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల వంతెనలు ధ్వంసం కావడంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల నీటితో నిండి రోడ్ల ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఈ రోడ్లపై నిత్యం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తిరుగుతున్నా మరమ్మతులకు మాత్రం నోచుకోవడం లేదు.

(ఆంధ్రజ్యోతి ,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నెట్‌వర్క్)


కోటపల్లి-అన్నసాగర్ గేటు మధ్య కోతకు గురైన రోడ్డు

ఇదేం దారిద్రం

భయంభయంగా ప్రయాణం

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం


అధ్వానంగా మారిన మోమిన్‌పేట్ - కేసారం రోడ్డు


కోతకు గురైన ఎరన్‌పల్లి-ఆశమ్మకుంట తండా రోడ్డు

వికారాబాద్ జిల్లాలో వాహనాల రద్దీ అధికంగా ఉండే వికారాబాద్ - తాండూరు, వికారాబాద్ - సదాశివపేట్, తాండూరు - కోట్‌పల్లి, సదాశివపేట్ - వికారాబాద్, వికారాబాద్ - మన్నేగూడ, పరిగి - నస్కల్ తదితర రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలను తప్పించుకుంటూ రోడ్లపై నడిపించడం వాహనదారులకు సవాల్‌గా మారింది. పగటి వేళలో ఈ పరిస్థితి ఉంటే రాత్రివేళలో వాహనం నడిపించే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాల బారిన పడి వాహనదారులు మృత్యువాత పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురియక ముందే రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఉంటే కొంత వరకైనా వాహనదారులకు ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాన మార్గాల్లో

మిగతా 7వ పేజీలో...

మేడ్చల్ నియోజకవర్గంలో..

ఘట్‌కేసర్ పరిధిలోని ప్రతాప్‌సింగారం నుంచి ఉప్పల్ రోడ్డులో ముత్వెల్లిగూడ వద్ద రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అవుశాపూర్ వద్ద వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపైకి వరదనీరు వచ్చి చేరి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. చీకట్లో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రోడ్లపై నీరు నిలిచి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ - కొంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో, మూడుచింతలపల్లి - ఉద్దమర్రి మార్గంలో రోడ్డు దెబ్బతిన్నది.


అవుశాపూర్ వద్ద సర్వీసు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


దోమ మండలం పాలేపల్లి నుంచి ఐనాపూర్ వెళ్లే రోడ్డు దుస్థితి



కుంట కాదు.. స్కూలే..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది నీటి కుంట అను కుంటే పొరపాటే, అది అచ్చంగా పాఠశాల ఆవరణే. ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ వరద నీటితో నిండిపోయింది. దీంతో పాఠశాలలోకి విద్యార్థులు వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-కొడంగల్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి)

భూములు లాక్కుంటే ఊరుకోం

- రైతుల భూములపై డేగల్లా వాలుతున్నారు
- ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే అయిదారు వేల ఎకరాలు స్వాధీనం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి


రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

వికారాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/నవాబుపేట: అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతుల నుంచి ప్రభుత్వం అప్పనంగా లాగేసుకుంటుందని, అలా చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. రైతులు భూములను నమ్ముకుని బతికితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను అమ్ముకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులను సోమవారం అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండించిన ఆమె వారిని పరామర్శించి మాట్లాడేందుకు మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం, చిట్టిగిద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రంగారెడ్డి జిల్లాలో రైతుల భూములపై డేగలు వాలినట్లు వాలుతున్నారని ఆరోపించారు. అన్నోజీగూడ, రావిర్యాల, యాచారం,

మిగతా 8వ పేజీలో...

రైతులకు ధైర్యం చెప్పేందుకే..

మీ భూములు పోతున్నాయని మీరెంత బాధ పడుతున్నారో... కేసీఆర్, కేటీఆర్ కూడా అంతే బాధపడుతున్నారని, ఆందోళన చెందుతున్న రైతులకు ధైర్యం చెప్పకపోతే చెట్టుకొకరు.. పుట్టకొకరు అవుతారని ధైర్యం చెప్పేందుకు తాను వచ్చానని ఆమె చెప్పారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న నవాబ్‌పేట, పూడూరు, మోమిన్‌పేట్, వికారాబాద్ మండలాల రైతులందరూ జేఏసీగా ఏర్పడితే, అన్ని విధాలుగా బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

పదిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

» జిల్లా విద్యాధికారి రేణుకాదేవి


శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న రేణుకాదేవి

పరిగి,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలు వందశాతం సాధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. పరిగి జెడ్పీహెచ్‌ఎస్-1 పాఠశాలలో జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, ఎఫ్‌ఎల్‌ఎన్ మెంటార్లకు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడతూ ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా బోధించి విద్యార్థులల్లో నాణ్యత ప్రమాణాలను పెంచాలన్నారు. పాఠశాలలో జరిగే రోజువారీ కార్యక్రమాలు, నివేదికలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో రామ్‌మస్తా, ఎంఈవోలు గోపాల్, వెంకట్, హబీబ్, రాంచంద్రయ్య, సాయిరెడ్డి, ఆర్‌పిలు రాజేశ్, విజయభాస్కర్‌రెడ్డి, మహిరాచారి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులు

పేర్లు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం


పాడైన పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో రాజారత్నం

పూడూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పంట నష్ట పోయిన రైతులు వ్యవసాయ అధికారిని సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం సూచించారు. మంగళవారం పూడూరు మండల పరిధిలోని రైతు వేదిక సమావేశంలో పాల్గొని అనంతరం పెద్ద ఉమెంతల్ గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలో సుమారు 450 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల వ్యవసాయాధికారి తులసీరామ్, విస్తీర్ణ అధికారులు శివ, రాజ్‌కుమార్, రైతులు క్రాంతి, యాదయ్య, తిరుమల్లయ్య, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.



నిలిచిన నీటి సరఫరా
కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులు 6
జుంటివాగు ఉధృతికి లైన్ కట్

బీజేపీలో గ్రూపు రాజకీయాలు
క్రమశిక్షణ కమిటీ వద్దకు పంచాయితీ 6
ఎంపీకి, జిల్లా అధ్యక్షుడి మధ్య విభేదాలు

పుట్టగొడుగుల్లా వసతిగృహాలు!

ఇళ్ల మధ్యనే ఇష్టారీతిన ఏర్పాటు



మైసమ్మగూడలో రెసిడెన్షియల్ భవనంలో ఏర్పాటు చేసిన హాస్టల్

- నిబంధనలు పట్టించుకోని యజమానులు
- మేడ్చల్ పరిధిలో యథేచ్ఛగా దందా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు


మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్ కాలనీలో వసతి గృహాలు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ గల్లీగల్లీకి ఒక ప్రైవేట్ వసతి గృహాలు(హాస్టల్) దర్శనమిస్తాయి. బాయ్స్ హాస్టల్ అంటూ కొందరు.. గర్ల్స్ హాస్టల్ అంటూ మరి కొందరు పోటాపోటీగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తూ దందా కొనసాగిస్తున్నారు. పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న వసతి గృహాలపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఈ వ్యాపారానికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. నగర శివారు ప్రాంతమైన మేడ్చల్‌లో పెద్ద సంఖ్యలో విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు ఉన్నందున రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చే విద్యార్థులకు, ఉద్యోగులకు వసతి కల్పించే వ్యాపారం ఇటీవల బాగా పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న పలువురు నిబంధనలను గాలికి వదిలి అరకొర వసతులతో రాత్రికి రాత్రే తెరిచేస్తున్నారు. డిమాండ్ నేపథ్యంలో వందల సంఖ్యల్లో

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వ ఆదాయానికి గండి

రెసిడెన్షియల్ భవనాల్లో హాస్టళ్ల ద్వారా వ్యాపారం కొనసాగిస్తున్నప్పటికీ స్థానిక మున్సిపల్ అధికారులు సదరు భవన యజమానులపై కమర్షియల్ ట్యాక్సును విధించడం లేదు. వసతి గృహాలు నిర్వహించే భవనాలను కమర్షియల్‌గా గుర్తించి వార్షిక ట్యాక్సు విధిస్తే మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘైసమ్మగూడ, కండ్లకోయ మున్సిపాలిటీలకు వార్షిక ఆదాయం భారీగా పెరుగుతుందని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు వసతి గృహాలు వినియోగిస్తున్న విద్యుత్ మీటర్లు కూడా పూర్తి స్థాయిలో రెసిడెన్షియల్ కేటగిరిలో ఉండటంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్ రాయితీని కూడా పొందుతుండటం గమనార్హం. దీనికి తోడు హాస్టళ్లను టార్గెట్ చేసుకుని కొన్ని అసాంఘిక శక్తులు వసతి గృహాల పరిసరాల్లో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కాగ్నా నదికి హారతి ఇస్తున్న అర్చకులు

కాగ్నాకు గంగా హారతి

తాండూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాండూరు కోకట్ గ్రామ సమీపంలోని వంతెన పక్కన మంగళవారం కాగ్నా నదికి మంగళ హారతి కార్యక్రమాన్ని బ్రాహ్మణ, అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి రోజున నిర్వహించే గంగా హారతిలో భాగంగా ప్రత్యేకంగా గంగా పూజ, గంగాకు దీపోత్సవం తదితర కార్యక్రమాలను చేపట్టారు.

బీజేపీలో గ్రూపు రాజకీయాలు

క్రమశిక్షణ కమిటీ వద్దకు పంచాయితీ

- ఎంపీకి, పార్టీ జిల్లా అధ్యక్షుడికి మధ్య విభేదాలు
- రెండు వర్గాల వాదనలు విన్న పార్టీ పెద్దలు

తాండూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సమయమొచ్చినా బీజేపీలో గ్రూపు విభేదాలు చల్లారడం లేదు. ఓ వైపు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వర్గం.. మరోవైపు పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గ్రూపులుగా ఏర్పడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం పార్టీ అధిష్టానం రెండు వర్గాల నాయకులను బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పిలిపించింది. క్రమశిక్షణా కమిటీ ప్రతినిధులు ధర్మరావు నేతృత్వంలో రెండు వర్గాల వారి వాదనలు వింది. జిల్లాలో అత్యధిక వర్గపోరు తాండూరు బీజేపీలోనే కొనసాగుతోందనే ప్రచారం ఉంది. ఇదే అంశంపై మంగళవారం తాండూరు బీజేపీ నాయకులే క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసి తమ వాదనలు వినిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని మర్చాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పార్టీ పెద్దల వద్ద పట్టుబట్టారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, జిల్లా అధ్యక్షుడిని సైతం అవమానపరుస్తున్నారని బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి బాలేశ్వర్‌గుప్తా, నాయకులు సుదర్శన్‌గౌడ్, పటేల్ విజయ్‌కుమార్ అధిష్టానానికి ఫిర్యాదుచేశారు. ఈ సమయంలో రాజశేఖర్‌రెడ్డి కూడా అక్కడే ఉన్నారు. ఎన్నికల సమయంలో గ్రూపులు సరికాదని, కలిసి పనిచేయాలని పార్టీ రాష్ట్ర నేతలు నాయకులను హెచ్చరించినట్లు తెలిసింది. వారి ఫిర్యాదులు, వాదనలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దృష్టికి తీసుకెళ్తామని నేతలన్నారు. కొంత కాలంగా తాండూరులో రాష్ట్ర నాయకులు యు.రమేష్, బాలేశ్వర్‌గుప్తా వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ నాయకుల మధ్య ఏర్పడుతున్న విభేదాలతో రాష్ట్ర నేతలు సైతం తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం. వీరి పంచాయితీలను త్వరగా తీర్చాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ పెద్దలను కోరుతున్నారు.



గురుకుల ఉపాధ్యాయుడికి డాక్టరేట్



హెచ్‌సీయూ వీసీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న విఠల్ రాథోడ్

కొడంగల్ రూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): కృషి వుంటే మనషులు రుషులవుతారని మరోసారి రుజువు చేశాడు గిరిజన బిడ్డ విఠల్ రాథోడ్. అతడు ప్రఖ్యాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించాడు. మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ఆడిటోరియంలో నిర్వహించిన యూనివర్సిటీ 25వ కాన్వకేషన్‌లో హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ బీజే. రావు నుంచి విఠల్ రాథోడ్ పీహెచ్‌డీ అందుకున్నారు. బషీరాబాద్‌కు చెందిన నాగిబాయి-రామునాయక్‌ల ద్వితీయ కుమారుడు విఠల్. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి ప్రోత్సాహంతో చదువుకున్నాడు. బషీరాబాద్‌లో పదో తరగతి, తాండూర్‌లో ఇంటర్, 2017లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ ఎంఏ ఇంగ్లీష్ చేశారు. 2015లో ఉస్మానియా నుంచి బీఈడీ, ఆచార్య నాగార్జున వర్సిటీ నుంచి ఎంఈడీ చేశారు. 2020లో హెచ్‌సీయూ పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందాడు. నెట్ సాధించి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌నకు ఎంపికై నెలకు రూ.53వేల చొప్పున ఐదేళ్లు స్టైఫండ్ అందుకున్నాడు. పీహెచ్‌డీలో భాగంగా జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. ఇండియా కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ప్రోత్సాహంతో 2023 జనవరిలో దక్షిణాఫ్రికా రాజధాని కేప్‌టౌన్‌లో.. 'బెండెడ్ లెర్నింగ్ ప్రభావవంత అభ్యసనకు హైబ్రీడ్ బోధన నమూనా' అనే అంశంపై ప్రజెంటేషనిచ్చాడు. హెచ్‌సీయూలో కేరళకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాగోపినాథ్ పర్యవేక్షణలో స్వదేశీ విద్యార్థుల జీవన నైపుణ్యాలు అనే అంశంపై పరిశోధన చేసి జూన్ 2024లో థీసెస్ సమర్పించాడు. 2025 ఫిబ్రవరిలో హెచ్‌సీయూ వైవా పరీక్షలో డాక్టరేట్ ప్రకటించారు. ఈ క్రమంలో 2023లో గురుకుల పరీక్షలో టీజీటీ-ఇంగ్లీష్ పోస్టుకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం విఠల్ కొడంగల్ సమీపంలోని ఎంజేపీటీ గురుకుల పాఠశాల (దౌల్తాబాద్)లో విధులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

చేవెళ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం కోరారు. మంగళవారం చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యను ఆయన కార్యాలయంలో సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని న్యాలటలో గల సర్వే నంబర్ 240లోని భూమిని కొందరు కబ్జా చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి విడిపించాలని అధికారులను కోరారు. సీపీఐ నాయకులు మక్బూల్, మల్గాని సుధాకర్‌గౌడ్, శివ, కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అభ్యర్థుల ఎంపికపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రిజర్వేషన్లతో అవకాశం రాని వారికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాభిమానం ఉండి, పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులొస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనితవిజయ్, అనంతరెడ్డి, మండ్లీ రాములు, రమణారెడ్డి, జహంగీర్ అలీ, పి.రాములు, చేగూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

సుమిత్రాబాయి మృతికి నేతల సంతాపం



తలకొండపల్లి: పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తల్లి సుమిత్రబాయి మృతికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ రవి సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆమె నివాసంలో సుమిత్రాబాయి మృతదేహానికి నివాళులర్పించారు. నెలరోజుల వ్యవధిలో రతన్‌సింగ్‌ఠాకూర్-సుమిత్రాబాయి దంపతుల మృతి బాధాకరం అన్నారు. బాలాజీసింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, వస్పుల జంగయ్య, ఆరిఫ్, జనార్ధన్‌రెడ్డి, అజీజ్, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా

- కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులు
- జుంటివాగు ఉధృతికి లైన్ కట్ ● రెండు రోజులుగా నీరు బంద్
- త్వరలోనే పునరుద్ధరిస్తామంటున్న అధికారులు


జుంటివాగు వరద ఉధృతికి కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులు

బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-తాండూరు రోడ్డు పక్కన జుంటివాగు ఉధృతికి మిషన్ భగీరథ పైపులు కొట్టుకుపోయాయి. చెక్‌డ్యాం వద్ద తాగునీటి సరఫరా మెయిన్‌లైన్ పైపులు డ్యామేజై నీటి సరఫరా నిలిచిందని గ్రిడ్ అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల కింద కురిసిన వర్షానికి జుంటివాగు ఉప్పొంగింది. చెక్‌డ్యాం కింద పైపులైన్ కొట్టుకుపోయి నీటి సరఫరా నిలిచింది. ఇప్పటికీ వరద పారుతోందని, ఇప్పుడే కొత్త పైపులు వేసే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోని నీటి వనరులను వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండు, మూడు రోజుల్లో పైపులు వేసి సరఫరాను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ తాండూరు డివిజన్ డీఈ విజయ్, ఏఈ సోయేల్ మంగళవారం తెలిపారు.

భవానీమాత ఆలయంలో చీరల పంపిణీ


ముత్తైదువులకు అమ్మవారి చీరలు అందజేస్తున్న పూజారి శంకర్‌స్వామిజీ

బషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దామర్‌చెడ్ అంబా భవానీ మాత ఆలయంలో ముత్తైదువులకు అమ్మవారి చీరల పంపిణీ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పూజారి శంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేయగా మహిళలు పెద్దసంఖ్యలో హాజరైయ్యారు. శంకర్‌స్వామిజీ ఆలయం చుట్టూ భక్తులతో కలిసి ప్రదిక్షణలు చేయించి ప్రవచనాలు విన్పించారు. ఆయన మట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని, ఆధ్యాత్మికంతో జీవితం సుఖమయం అవుతుందని సూచించారు. కార్యక్రమంలో నవాంద్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి అభినందనీయం


పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారిత కోసం పుస్తక రచన అభినందనీయమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. అంకుశాపూర్‌లోని సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాల అధ్యాపకురాలు అరుణ.. 'తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర' అనే అంశంపై వ్యాసాన్ని రచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి అరుణ నిరంతరం కృషిచేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనేదే ఆమె తపన అన్నారు. ఉద్యమంలో మహిళల పాత్ర గురించి వ్యాసాన్ని రాయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అరుణను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, తెలుగు లెక్చరర్ శ్రీవర్ధిని పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న రామిరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో సివిల్ ఇంజనీర్ల పాత్ర కీలకమని క్రెడాయ్ చైర్మన్ జి.రామిరెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన భవనాల్లో లీకేజీలు, సీపేజీల నివారణపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవ భారత నిర్మాణంలో సివిల్ ఇంజనీర్లే ముఖ్య భూమిక పోషిస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం పెంపొందించుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడుతయన్నారు. భవనాల్లో లీకేజీలు, సీపేజీలను అరికట్టేందుకు సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ఇంజినీర్లు ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో డీన్లు విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మనోహర్‌రెడ్డి

- స్థానిక ఎన్నికల నేపథ్యంలో నాయకుల భేటీపై చర్చ


నారాయణరావు ఇంట్లో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంగళవారం బషీరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనతో ప్రత్యేక భేటీ అయి చర్చించారు. ఇద్దరు నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై, ప్రస్తుత బీసీ రిజర్వేన్లపై రానున్న హైకోర్టు తీర్పు అంశంపై చర్చించినట్టు సమాచారం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆయా పార్టీల గెలుపోటములపై కూడా సుమాలోచనలు చేసినట్లు తెలిసింది. ఎన్నికల్లో నారాయణరావు కుటుంబం నుంచి బరిలో ఎవరు నిలుస్తారనే దానిపై ఏకాంతంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. బషీరాబాద్ మండల ఎంపీపీ, జెడ్పీటీసీల స్థానాలు బీసీలకు రిజర్వు అయినందున.. 'మీ కుటుంబం నుంచి ఎవరైనా పోటీ చేస్తారా?' అని ఎమ్మెల్యే, నారాయణరావుతో మాట్లాడినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నారాయణరావు ఇంటికి వెళ్లి కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. వీరి భేటీలో సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పెద్దేముల్ మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేష్, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాము, పవన్, సాయిల్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలో 118 షాపులకు 54 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పేట్ బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధి మద్యం షాపుల లైసెన్స్‌లకు దరఖాస్తులు తీసుకుంటున్న ట్లు మేడ్చల్ జిల్లా ప్రొహిబిషన్ అధికారి ఎస్‌కె పయాఉద్దీన్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ, బాలానగర్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ యాదయ్యలు తెలిపారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ చేశారని, మేడ్చల్ జిల్లా యూనిట్‌లో మొత్తం 118మద్యం షాపు లు ఉండగా వాటిలో 45 దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. బాలానగర్‌లో 10, కుత్బుల్లాపూర్‌లో 16, మేడ్చల్‌లో 28 దరఖాస్తులు నమోదయ్యాయి. బాలానగర్‌లో 42దుకాణాలకు 2షాపులను ఎస్సీల కు, కుత్బుల్లాపూర్‌లోని 47 దుకాణాలకు ఐదు గౌడ కులస్తులకు, 1 ఎస్టీ, ఎస్సీలకు ఒక్కోటి కేటాయించామన్నారు. అలాగే మేడ్చల్‌లోని 29 దుకాణాలకు ఆరు గౌడ కులస్తులకు, 2 షెడ్యూల్ కూలాలకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలినవి జనరల్ కేటగిరీకి వస్తాయన్నారు. ఈ నెల 18 దరఖాస్తులకు చివరి తేదీ అని, 21 సంవత్సరాలు కంటే ఎక్కువ వయసున్న వారు ఎవరైనా నాన్ రిఫండబుల్ మొత్తం రూ.3లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లక్కీ డ్రా ద్వారా షాపులను కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8712658727, 8742658741 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు,



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న అడ్వకేట్లు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ సీజేఐపై దాడి దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే ప్రమాదాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, కమల్‌రెడ్డి, అశోక్ కుమార్, శంకరయ్య, వసుంధర, శ్రీలత, రాంచందర్‌రావు, రాంచందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మాధవరెడ్డి, జగన్ రాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరుగుదొడ్లను

పరిశుభ్రంగా ఉంచుతాం

- చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



స్వచ్ఛ ట్రక్కులను ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పదేళ్లుగా తన ఫౌండేషన్ కృషిచేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు కొత్త స్వచ్ఛ ట్రక్కులను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధి 11మండలాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను క్లీన్‌గా ఉంచేందుకు 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయన్నారు. వీటికి అదనంగా ఐదు ట్రక్కుల రాకతో వాటి సంఖ్య 16కి చేరిందన్నారు. ఈ ట్రక్కుల ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయించమేకాక స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఒక్కో ట్రక్కు 30పాఠశాలల్లో సేవలందిస్తోందని, మొత్తం 330 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు 16 ట్రక్కులను వినియోగిస్తున్నామని తెలిపారు.

పాడైన పంటలకు పరిహారమివ్వాలి

బంట్వారం అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వారం రోజుల కింద కురిసిన వర్షాలకు బంట్వారం, నూరుల్లాపూర్, యాచారం, సుల్తాన్‌పూర్, నాగ్వారం తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. తమకు పరిహారం ఇవ్వాలని మండల రైతులు మంగళవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. వర్షాలతో పంటలు నాశనమయ్యాయని, దిగుబడి రాదని చెప్పారు. మండలంలో 180 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించాలని కోరారు. వెంటనే పంటనష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, నర్సిములు, బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, ముస్తఫా, కిష్టయ్య, జగదీష్ పాల్గొన్నారు.

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి



జాపాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బస్‌చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం జాపాలలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడం అన్యాయం అన్నారు. ఆర్టీసీ, ప్రభుత్వం చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ నాగరాజు, బి.చంద్రకాంత్, బీఎస్.సతీష్, యాదయ్య, బి.సోమేశ్, సంజీవ, దర్శన్, రవి, యాదయ్య, వెంకటేష్, నర్సింహ పాల్గొన్నారు.

ఇదేం 'దారి'ద్రం

(ఐదో పేజీ తరువాయి)

రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వికారాబాద్ - మోమిన్‌పేట్ రోడ్డులో కొత్తగడి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలు నియంత్రణ కోల్పోయి చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇటీవల నలుగురు మృతి చెందారు. గుంతలమయంగా మారిన రోడ్లతో జిల్లాలో వారానికి పది నుంచి ఇరవై వరకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



వర్షాలకు దెబ్బతిన్న నాగారం మెయిన్ రోడ్డు

కోట్‌పల్లి అలుగు ఉధృతికి..

ధారూరు నుంచి నాగసముందర్ గ్రామానికి వెళ్లే రోడ్డు కోట్‌పల్లి అలుగెత్తి ప్రవహించడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రూ. 50 లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మించినా అది నాసిరకంగా ఉండడంతో మళ్లీ కొట్టుకుపోయింది. ధారూరు నుంచి కేరెళ్లి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు సైతం గుంతలతో దర్శనమిస్తోంది. మోమిన్‌పేట నుంచి శంకర్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు, ఎన్కతల-సదాశివపేట రోడ్డు, గోవిందాపూర్ -కద్పర్ల, వెల్చాల్ - దుర్గంచెరువు, టేకులపల్లి - గోవిందాపూర్ పీఆర్ రోడ్లు పాడై ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బంట్వారం మండలంలో ఉన్న రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రయాణీలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయని ప్రజలు ఖండిపడుతున్నారు. యాచారం చౌరస్తా - బంట్వారం, బంట్వారం - తొర్మామిడి ఆర్‌అండ్‌బీ రోడ్లు, నూర్లాపూర్ - యాచారం గేటు, రొంపల్లి పీఆర్ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. పట్లూర్- కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు, రావులపల్లి - కల్కోడ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారాయి.



వరదకు కొట్టుకుపోయిన కోకట్ వంతెన

కొట్టుకుపోయిన కోకట్ బ్రిడ్జిపై రోడ్డు...

తాండూరు నియోజకవర్గంలో యాలాల మండలం కోకట్ పురాతన బ్రిడ్జిపైన రోడ్డు కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు తాండూరు-కోట్‌పల్లి ఆర్ అండ్‌బీ రోడ్డులో గుంతలు పడి సుమారు ఐదుకోట్ల వరకు నష్టం వాటిల్లింది. తాండూరు-తొర్మామిడి రోడ్డుకు సుమారు రూ 2 కోట్ల వరకు నష్టం వాటిల్లింది. పరిగి డివిజన్‌లోని పరిగి, పూడూరు, కులకచర్ల, దోమ, చౌడాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిగి - మిట్టకోడూరు, యాబాజీగూడ, ఇబ్రహీంపూర్, రాకొండ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దోమ, పాలేపల్లి, ఐనాపూర్, మల్లేపల్లి, మోత్కూర్, ఐనాపూర్ రోడ్లు రాకపోకలకు వీలు కాకుండా మారాయి. కులకచర్ల నుంచి బండవెల్కిచర్ల, రుక్కుంపల్లి వెళ్లే రోడ్లు కోతకు గురయ్యాయి. నస్కల్ శివారు తోపాటు పూడూరు మండలం రాకంచర్ల నుంచి కంకల్ వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగా మారాయి. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో పలు రోడ్లు కోతకు గురయ్యాయి. కొడంగల్ మండలంలోని ఎరన్‌పల్లి-ఆశమ్మకుంట తండా రోడ్డుతో పాటు పెద్దనందిగామ, చిట్లపల్లికి వెళ్లే మార్గాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి.

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయరహదారి..

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల మండలంలోని పామెన, చన్‌వెల్లి, బస్తేపూర్, మల్కాపూర్, ఆలూర్, తల్లారం, కౌకుంట్ల, అంతారం, ముడిమ్యాల్, కుమ్మెర, రావులపల్లి, ఈర్లపల్లి, ఎన్కేపల్లి, దేవరంపల్లి తదితర గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే షాబాద్ మండలంలోని హైతాబాద్, చందనవెళ్లి, ఎట్లఎర్రవల్లి, దోస్వాడ, రుద్రారం, సోలిపేట్, మద్దూర్ తదితర గ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. మొయినాబాద్ మండలంలో వెంకటాపూర్, పెద్దమంగళరం, శ్రీరాంనగర్, సురంగల్, ఎన్కేపల్లి, చిలుకూరు గ్రామాల రోడ్లు కూడా గుంతలమయంగా మారాయి. శంకర్‌పల్లి మండలంలో పొద్దటూర్, ఎల్వర్తి, టంగటూర్, శేరిగూడ, గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. చేవెళ్ల - శంకర్‌పల్లి రోడ్డుపై ఈర్లపల్లి నుంచి ఎల్వర్తి వరకు గుంతలు పడ్డాయి.

గుంతలతో వాహనదారుల ఇక్కట్లు

మహేశ్వరం నియోజకవర్గంలో తుమ్మలూరు మీదుగా అటు మహేశ్వరం, ఇటు హైదరాబాదు ప్రధాన రహదారిలో ప్రతిరోజు వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. రోజూ వందలాది వాహనాలు వెళ్లే ఈ రోడ్డు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది. భారీగా గోతులు ఏర్పడ్డాయి. గోతులను పూడ్చాలని తుమ్మలూరు గ్రామస్తులు సంబంధిత అధికారులను వేడుకున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాగారం నుంచి కోళ్లపడకల్ వెళ్లే ప్రధాన రహదారి వర్షాల కారణంగా నాగారం వద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారింది.



వర్షాలకు గుంతలమయంగా మారిన అంకిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు

అధ్వానంగా పట్నం రహదారి

ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపోల్ - పోల్కంపల్లి, దండుమైలారం - నెర్రెపల్లి, పోల్కంపల్లి - నెర్రెపల్లి పంచాయతీరాజ్ రోడ్లు, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ నుంచి నాదర్‌గుల్ వెళ్లే రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది. ఇబ్రహీంపట్నం - నాగన్‌పల్లి వెళ్లే రోడ్డు, ఇంజాపూర్ - తుర్కయాంజాల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఇక్కడ రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా టెండర్ ప్రక్రియ పూర్తయినా కాంట్రాక్టరు పనులు చేపట్టడం లేదు.



రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

మోకాళ్ల లోతు నీటిలో ..

ఎల్లమ్మ గుడికి వెళ్లాలంటే భక్తులకు తప్పని తిప్పలు

మహేశ్వరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వర్షం పడిందంటే చాలు తుక్కుగూడ మున్సిపాలిటీలోని సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల వెళ్లే ప్రధాన రహదారి వర్షం నీటితో చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డులో రెండు గ్రామాల ప్రజలే కాకుండా, శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లేందుకు ప్రతి మంగళవారం వేలాదిగా భక్తులు తరలివెళ్తారు. మోకాళ్ల లోతు నీటిలోంచి ఆలయానికి వెళ్లక తప్పని పరిస్థితి. కొందరు ట్రాక్టర్లు, కార్లు, ఆటోల ద్వారా ఆలయానికి చేరుకుంటున్నారు. సర్ధార్‌నగర్ నుంచి రావిర్యాల వరకు శాశ్వత పరిష్కారం లభించేలా రోడ్డు పనులు పూర్తి చేయాలంటే రూ.10 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ, కార్యరూపం దాల్చడంలేదు. ఫలితంగా వాహనదారులు, ఎల్లమ్మ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

లేటొచ్చారని గేటు బయటే..

- గురుకుల విద్యార్థులు, తల్లిదండ్రుల పడిగాపులు
- ఇది సరికాదని తల్లిదండ్రుల ఆగ్రహం



గురుకుల పాఠశాల గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కొడంగల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన గురుకుల విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా రావడంతో మంగళవారం బయటే పడిగాపులు కాశారు. కొడంగల్ శివారులోని తాండూర్ రోడ్డులో దౌల్తాబాద్ బీసీ గురుకుల విద్యార్థులు దసరా అనంతరం మంగళవారం పాఠశాలకొచ్చారు. సోమవారం రావాల్సిన వారు ఒక్కరోజు ఆలస్యంగా రావడంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను గేటు బయటే నిలిపారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహంతో నిర్వాహకులను ప్రశ్నించారు. స్థానిక మీడియా ప్రతినిధులు ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడగా మధ్యాహ్నం 12:30 తర్వాత పాఠశాలలోకి అనుమతించారు. ఉదయం నుంచి ఖాళీ కడుపుతో ఎండలో విద్యార్థులు, తల్లిదండ్రులు వేచి ఉన్నారు. సెలవుల అనంతరం బ్యాంకు ఖాతా, ఆధార్ అప్డేషన్లతో రావాలని విద్యార్థులకు యజమాన్యం సూచించారని, దీంతో మీ సేవ కేంద్రాలకు తిరగడం వల్ల ఆలస్యం అయిందని తల్లిదండ్రులు వాపోయారు. ఒక్క రోజు ఆలస్యంగా వస్తే ఇన్ని ఇబ్బందులు పెడతారా? అని మండిపడ్డారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్ స్పందిస్తూ.. తాము ఆర్సీవో ఆదేశం మేరకే నడుచుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కాగా ఇక్కడ గెస్ట్ ఫ్యాకల్టీని సైతం వేధిస్తున్నారని పలువురు తెలిపారు. విద్యార్థుల పడిగాపులపై ఆర్సీవోను వివరణ కోరగా సమాధానం చెప్పకుండా దాటవేశారు.

మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ముస్లింలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగానే వాడుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముస్లింలను ఓట్ల కోసమే వాడుకుంటుందని, వారికి మెరుగైన జీవన స్థితిగతులను కల్పించడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ముస్లింల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. యువతకు 80శాతం సబ్సిడీతో రుణాలు, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశామన్నారు. కేసీఆర్ పాలనలో మైనారిటీ రెసిడెన్షియల్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడా మాటే ఎత్తడం లేదన్నారు. ఒక్క మైనార్టీకి కూడా క్యాబినెట్‌లో చోటివ్వలేదన్నారు. కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత వాగ్దానాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ముస్లింలు, ఇతర మైనారిటీ వర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ముర్తుజా అలీ, సుభాన్‌రెడ్డి, ఫరీద్, ఇస్మాయిల్, షఫీ, దత్తు పాల్గొన్నారు.

ఆలయాలను పట్టించుకోని ఎమ్మెల్యే

- సబితారెడ్డికి మదర్సాలు, మసీదులంటేనే ఇష్టం
- మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ రోడ్డుపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న శ్రీరాములు

మహేశ్వరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితారెడ్డికి మదర్సాలు, మసీదులపై ఉన్న ప్రేమ హిందూ ఆలయాలపై ఎందుకు లేదని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ప్రశ్నించారు. మంగళవారం తుక్కుగూడలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ఎంతటి విశిష్టత ఉందో అదే తరహాలో ప్రతీ మంగళవారం పదివేల మందికిపైగా భక్తులు సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వస్తారని తెలిపారు. మరి ఈ ఆలయ అభివృద్ధి ఎమ్మెల్యే ఎందుకు సహకరించడంలేదని ప్రశ్నించారు. తుక్కుగూడ, రావిర్యాల నుంచి ఆలయానికి వెళ్లే రోడ్డు వాన నీటితో మునిగిపోమయిందని, ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటులో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ఒకవర్గం ఓట్లతో గెలిచిన సబితారెడ్డి.. అదే వర్గానికి చెందిన ప్రార్థన మందిరాలకే ప్రాధాన్యం ఇస్తూ హిందూ ఆలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వం కూడా ఆయాలను పట్టించుకోవడంలేదన్నారు. ఎల్లమ్మ ఆలయ రోడ్డు సమస్యను పరిష్కరిస్తానన్న సబితారెడ్డి ఇప్పుడు తన పార్టీ అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎల్లమ్మ ఆలయ రోడ్డును బాగు చేయించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మునిసిపల్ మాజీ చైర్మన్ కె.మధుమోహన్, నాయకులు శివకుమార్, రాజు, హేమలత, యాదగిరిరెడ్డి, లక్ష్మణ్, విలాస్, శ్రీను, శ్రీనివాస్‌నాయక్, సుధాకర్, మహేశ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి సంగెంకు తరలింపు

ఎమ్మెల్యే లెటర్‌తో ప్రీ ప్రైమరీ స్కూల్ మార్పు

- టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ
- కూతురి ఉద్యోగం కోసం చక్రం తిప్పిన వ్యక్తి..?



పాతబడిన సంగెం పాఠశాల

కేశంపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాజకీయ చక్రం తిప్పారు.. ఎమ్మెల్యే లెటర్‌ను ఉపయోగించి నోటిఫికేషన్‌లో లేని పాఠశాలకు ప్రీ ప్రైమరీ స్కూల్‌ను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు సైతం నూతన భవనం, వసతులున్న పాఠశాలను వదిలేసి.. పాత పాఠశాల భవనంలోకి ప్రీప్రైమరీ స్కూలును తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహమైన తన కూతురికి ఉద్యోగం ఇప్పించుకునేందుకే ఓ వ్యక్తి ఎమ్మెల్యే లెటర్‌ను వాడుకొని ఇదంతా చేస్తున్నాడనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ అంశం వివరాల్లోకి వెళ్తే.. సర్వశిక్షా అభియాన్ కింద కేశంపేట, ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు టీచర్లు, ఆయా పోస్టులకు సెప్టెంబరు 1న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సెప్టెంబరు 6 వరకు పోస్టులకు దరఖాస్తులు స్వీకరించారు. ఫైనల్ చేసేందుకు త్రీమెన్ కమిటీ సిద్ధమైంది. ఇంతలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ సెప్టెంబరు 1న విద్యాశాఖకు లెటర్(నంబర్ 2086) రాస్తూ ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఏర్పాటు కానున్న ప్రీ ప్రైమరీ స్కూల్‌ను సంగెంకు మార్చాలని కోరారు. దీంతో సెప్టెంబరు 19న సంగెంలో ప్రీ ప్రైమరీ స్కూలు ఏర్పాటుకు కలెక్టర్ నుంచి ఇన్‌చార్జి ఎంఈవోకు ఆదేశాలందాయి. దసరా సెలవులు ఉండడంతో ఈ విషయం అప్పట్లో బయటకు పొక్కలేదు.

ప్రీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు ఎక్కడంటే..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా ప్రీ ప్రైమరీ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ స్కూళ్లకు అనుబంధంగా వీటిని పెడుతున్నారు. నాలుగేళ్లు నిండిన పిల్లలను వాటిల్లో చేర్చుకుని ఆటపాటలతో బోధిస్తారు. పిల్లలకు ఐదేళ్లు రాగానే అదే ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్చుతారు. అయితే యూడీఐఎస్‌సీ(ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్)లో ఒక్క విద్యార్థి కూడా సంగెం నుంచి నమోదు కాలేదు. పాత పాఠశాలలో వసతుల్లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరి ఇక్కడికి ప్రీ ప్రైమరీ పాఠశాలకు మార్చడం ఎవరి ప్రయోజనం కోసమని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఎక్లాస్‌ఖాన్‌పేటలోని పాఠశాల భవనం

టీచర్, ఆయా పోస్ట్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ఎక్లాస్‌ఖాన్‌పేట ప్రీ ప్రైమరీ పాఠశాల కోసం టీచర్, ఆయా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. టీచర్ పోస్టుకు ఇంటర్ విత్ డీఈడీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, కచ్చితంగా గ్రామానికి చెందిన వారై ఉండాలనేది నిబంధన. టీచర్ పోస్టుకు టి.చైతన్య(ఇంటర్-డీఈడీ), ఎన్.కావేరి(ఇంటర్), కె.శ్రావణి(ఇంటర్), ఇ.సంతోష(ఇంటర్)లు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా పోస్టుకు అఫ్రిన్ ఒక్కరే దరఖాస్తు చేసుకుంది. అధికారులు వీరిలో ఇద్దరిని ఫైనల్ చేసినట్టు సమాచారం.

సంగెం పాఠశాలకు ఒకే దరఖాస్తు?

సంగెంలో ప్రీప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు అధికారులు సెప్టెంబరు 19న నోటిఫికేషనిచ్చారు. టీచర్, ఆయా పోస్టులకు మాత్రం నోటిఫికేషన్ ఇవ్వలేదు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చక్రం తిప్పి వివాహమైన తన కూతురికి టీచరు పోస్టు ఇప్పించేందుకు దరఖాస్తు చేయించినట్టు తెలుస్తోంది. దీనిపై అధికారులు విచారణ చేసి అవసరం, పిల్లలు ఎక్కువగా, వసతులు ఉన్న చోటే ప్రీ ప్రైమరీ స్కూలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు

- కానరాని సేంద్రియ ఎరువు తయారీ
- వృథా అవుతున్న ప్రజాధనం
- పట్టించుకోని అధికారులు

కులకచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చి గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాలని గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా కంపోస్టు షెడ్లను నిర్మించింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారు చేసి పంచాయతీలు ఆదాయం పొందాలని వీటి నిర్మాణం చేపట్టింది. కానీ కులకచర్ల మండలంలో ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కనిపించడం లేదు. లక్షలాది రూపాయలు


తిరుమలాపూర్‌లో రోడ్డు పక్కన వేసిన చెత్త

వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్ల నిర్వాహణను పంచాయతీలు గాలికొదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

లక్షలాది రూపాయలు వృథా

మండలంలోని 32 గ్రామాల్లో రూ.2.5 లక్షల చొప్పున కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టారు. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికి బుట్టలు పంపిణీ చేశారు. అయితే కంపోస్టు షెడ్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. ప్రారంభ దశలో వాటి నిర్వాహణపై ఆసక్తి కనబర్చిన అధికారులు తర్వాత పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

అడ్డగోలుగా చెత్త పారబోత

45రోజుల పాటు దశల వారీగా సేంద్రియ ఎరువును తయారు చేయాల్సి ఉంది. అయితే చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్న సిబ్బంది గ్రేడింగ్ చేయకుండా కుపులుగా పారబోస్తున్నారు. సిబ్బంది ఆ చెత్తను వారం రోజులకోసారి తీసుకెళ్లి గ్రామశివారులో పడేసి మంటపెడుతున్నారు. చెత్తను అడ్డగోలుగా పోస్తుండటంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు గాలికి పంట పొలాల్లో చేరి రైతులు ఇ


తిరుమలాపూర్‌లో నిరుపయోగంగా షెడ్

బ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపోస్టు షెడ్ల నిర్వాహణను పూర్తి స్థాయిలో చేపట్టి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో చెత్తను రోజు వారీగా డంపింగ్ యార్డుకు తరలించేలా ఆదేశాలు జారీ చేస్తాం. ప్రతీ కంపోస్టు షెడ్డులో ఎరువులు తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం. **- రామకృష్ణ, కులకచర్ల ఎంపీడీవో**

భారీ వర్షం.. విద్యార్థుల ఇక్కట్లు

పూడూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో తిరుమలాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. తిరుమలాపూర్‌లోని పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


తిరుమలాపూర్‌లో కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

ఏడుగురు జీపీవోల నియామకం

కులకచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలానికి కొత్తగా ఏడుగురు గ్రామపాలన అధికారులు (జీపీవో)లను ప్రభుత్వం నియమించిందని తహసీల్దార్ మనోహరచక్రవర్తి తెలిపారు. వారిని క్లస్టర్‌ల వారీగా నియమించినట్లు తెలిపారు. భాను చందర్ కులకచర్ల, బండవెల్కిచర్ల (ఇంచార్జ్), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బొంరెడ్డిపల్లి, నర్సిములు ముజాహిద్‌పూర్, రాములు కుసుమ సముద్రం, సత్యమ్మ సాల్విడ్, శ్రీనివాసులు తిరుమలాపూర్, స్వప్న పుట్టపహాడ్ గ్రామాలకు నియమించినట్లు తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

● పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో మంగళవారం పరిగి మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. అదేవిధంగా కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, దీన్ని అవకాశంగా తీసుకుని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు ఆర్.ఆంజనేయులు, సురేందర్, మాజీ మునిసిపల్ చైర్మన్ అశోక్, నాయకులు రాజేందర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పరిగి: కాంగ్రెస్ బాకీకార్డులను విడుదల చేస్తున్న మహేశ్‌రెడ్డి

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

పూడూరు: బీఆర్ఎస్ కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో మన అభ్యర్థులను గెలిపించుకుందామని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రాకంచెర్ల పత్తిమిల్లులో మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి సత్తా చాటాలన్నారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

తాండూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే సన్మానించారు. ఓ పత్రికా జర్నలిస్టు నర్సిములు పద్మ దంపతుల కుమారుడు ఆదిత్య వర్ధన్ ఇటీవల జరిగిన నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి కామినేని మెడికల్ కళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి మెడికల్ సీటు సాధించడంతో ఆదిత్యవర్ధన్‌ను మంగళవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయన నివాసంలో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళిగౌడ్, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, పట్లోళ్ల నర్సిములు ఉన్నారు.


ఆదిత్యవర్ధన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

విద్యాసంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

కొడంగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోనే విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొడంగల్‌కు సమీకృత గురుకులాలు, మెడికల్, వెటర్నరీ కళాశాలలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల కోసం భూ సేకరణ పూర్తయిన తర్వాత పనులు కొనసాగుతున్న క్రమంలో ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. అదేవిధంగా పాత కొడంగల్ వద్ద సమీకృత గురుకులాలు మంజూర్‌తో పనులు ప్రారంభమైన క్రమంలో ఇతర ప్రాంతాలకు తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రధానంగా విద్యావ్యవస్థలో వెనకబడిన కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వాల్మీకి యుగ పురుషుడు

వికారాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి కేవలం ఒక కవి మాత్రమే కాదని, ఆయన ఒక యుగ పురుషుడని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, ఏవో ఖాజమొద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, ఆర్ఐలు డేవిడ్, అంజాత్‌పాషా పాల్గొన్నారు.


వికారాబాద్: వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రచనలు, సాహిత్య సేవను గురించి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, ఆర్వో రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇంచార్జు శానిటరి ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్ఐ రాములు, వార్డు అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని వాల్మీకి ఆలయంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మాజీ కౌన్సిలర్ పరిమళ, తాండూరు రిక్రేషన్ క్లబ్ అధ్యక్షులు కల్వ రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సత్యమూర్తి, వినోద్ కుమార్, తదితరులు పూజలు చేశారు. నిర్వాహకులు అతిథులను సన్మానించారు

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్‌లో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా, ఆనందోత్సవాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి కమిషనర్ జ్యోతి, మేనేజర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఈఈ సునీత, ఏఈ నిరీశ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పూలమాలలువేసి నివాళులర్పించారు.


కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు


తాండూరు మున్సిపల్ కార్యాలయంలో..

సీజేఐపై దాడి ప్రజాస్వామ్యానికి అవమానకరం

పరిగి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రాంగణంలో సీజేఐపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ మంగళవారం రాత్రి పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల, టీఎంటీఎఫ్ నాయకులు వెంకటయ్య, నరేందర్, అంజయ్య, బుగ్గయ్య, వినోద్, లక్నాపూర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


కీసరలో నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు


పరిగి: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సంఘాల నాయకులు

కీసర: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై రాకేష్‌కిషోర్ చేసిన దాడిని కీసర అంబేడ్కర్ సంఘం సభ్యులు ఖండించారు. దాడిని నిరసిస్తూ మంగళవారం కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జస్టిస్ గవాయ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంబేడ్కర్ సంఘం సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాకేష్ కిషోర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పుట్టగొడుగుల్లా వసతిగృహాలు!

(ఐదో పేజీ తరువాయి)

వసతి గృహాలు దర్శనమిస్తున్నాయి. నిబంధనలు గాలికి వదిలి ఇళ్ల మధ్యన హాస్టళ్లను తెరుస్తున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో స్థానికులు మండి పడుతున్నారు. పెరుగుతున్న డిమాండ్ కారణంగా ప్రయాణ వసతులు, మార్కెట్ అందుబాటులో ఉన్న కాలనీల్లోని రెసిడెన్షియల్ ఇళ్లను అద్దెకు తీసుకుని వాటిలో వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ డిపోకు సమీపంలోని కాలనీల్లో చాలావరకు భవనాల్లో విచ్చలవిడిగా వసతి గృహాలు వెలిశాయి. అదే విధంగా విద్యాసంస్థలు ఉన్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ, కండ్లకోయ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. రెండు మూడు అంతస్తుల భవనం ఉన్న ఇళ్ల యజమానులు లక్షల్లో అద్దె రావడంతో చాలా మంది తమ ఇళ్లను హాస్టల్ నిర్వాహకులకు అద్దెకు ఇచ్చి వారు ఇతర అద్దె ఇళ్లల్లోకి మకాం మార్చుతున్నారు.

ప్రశాంతత కోల్పోతున్న కాలనీవాసులు

కాలనీల్లో వెలుస్తున్న వసతి గృహాల కారణంగా స్థానికులు ప్రశాంతత కోల్పోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక బాలికల వసతి గృహం ఉన్న కాలనీల్లో మధ్య రాత్రి వరకు పోకిరీల బెడద ఉంటుందని చుట్టుపక్కల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం నిర్వహిస్తున్న వసతి గృహాల్లో కనీస భద్రతా ఏర్పాట్లు కూడా కనిపించని పరిస్థితి.

భూములు లాక్కుంటే ఊరుకోం

(ఐదో పేజీ తరువాయి)

మొయినాబాద్ ఎన్కేపల్లి, పెద్దమంగళారంలో భూములు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, చివరకు చేవెళ్ల మండలం, హస్తేపూర్‌లో కూడా భూములు తీసుకునే ప్రయత్నం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే అయిదారు వేల ఎకరాలను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రైతుల నుంచి అప్పనంగా భూములు లాగేసుకుంటున్నారని, ఇది ప్రజా పాలననా.. ప్రజా కంఠక పాలనా అని ఆమె ప్రశ్నించారు రైతులు ఏమి తప్పు చేశారని పోలీసులు అరెస్టు చేశారని ఆమె ప్రశ్నించారు.

సర్కారు నడుపుతున్నారా... సర్కస్ నడుపుతున్నారా ?

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ నడిపిస్తున్నారా ? లేక సర్కస్ నడిపిస్తున్నారా అనేది తెలియడం లేదని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విమర్శించారు. అమ్ముడు, కొనుడు తప్ప ఆయనకేమీ తెలియదన్నారు. పరిగి, నవాబ్‌పేట్ ఎమ్మెల్యేలు, స్పీకర్ ఒత్తిళ్లతోనే ట్రిపుల్ ఆర్‌కు కొత్త అలైన్‌మెంట్ ఖరారు చేశారని ఆయన ఆరోపించారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయే రైతులకు భూమికి భూమి ఇవ్వాలని, భూములు లేకపోతే బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, టీజీఈఎస్‌డబ్ల్యుఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, నాయకులు దేశాముల్ల అంజనేయులు, భరత్‌రెడ్డి, దయాకర్ రెడ్డి , విజయ్‌కుమార్, శాంతికుమార్, దయాకర్‌రెడ్డి, పురుషోత్తం చారి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య, గౌస్ పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తా: ఎంపీ


కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, సంఘం నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం శామీర్‌పేట్ మండల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం భవనంలో మంగళవారం అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం భవన ప్రహరీ నిర్మాణానికి, బోరు ఏర్పాటుకు సహకారమందిస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

సంక్షిప్తంగా..

దరఖాస్తులకు ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని 41 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీఐ జూపల్లి రవి తెలిపారు. 21 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు రుసుము రూ.3లక్షలు ఉంటుందని తెలిపారు. చెల్లించిన రుసుము తిరిగి ఇవ్వబడదన్నారు. ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

శామీర్‌పేట: శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు.శామీర్‌పేటకు చెంది గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా శామీర్‌పేటకు చెందిన దూడల వంశీగౌడ్, యాదగిరిగౌడ్ వారి కుటుంబ సభ్యులు 25 కేజీల బియ్యం అందజేయగా శామీర్‌పేటకు చెందిన డిజి వెంకటేశ్‌గౌడ్ అన్నదానికి సహకరించారు.

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సతీమణి మృతి

తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణ రెడ్డి సతీమణి మాణెమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మాణెమ్మ భౌతిక కాయాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ఆధ్యాత్మికతను రక్షిస్తున్నదే సంకీర్తనకారులు

పరిగి: ఆధ్యాత్మికతను రక్షిస్తున్నదే సంకీర్తనకారులని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ పి.భాస్కర యోగి అన్నారు. టి.అంజల్‌రెడ్డి, రాములు సంయుక్తంగా రచించిన సంకీర్తనలే భవన్నుతి-లొంక అంజనేయస్వామి భజనకీర్తల పుస్తకాన్ని మంగళవారం లొంక క్షేత్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ మండలి సభ్యులు నర్సిరెడ్డి, రమేశ్‌యాదవ్, గోపాల్, జంగయ్య, లాలయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఇంటిని నిర్మిస్తున్నారని ఫిర్యాదు

దోమ: అయినాపూర్‌లోని ఎస్సీ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే ఆపాలని ఎస్సీ కాలనీవాసులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి నరేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

బొంరాస్‌పేట్: స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ బరిలో నిలిచే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య కోరారు. బొంరాస్‌పేట్‌లో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కష్టజీవుల ఎర్రజెండా సీపీఎం తరపున కొడంగల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా, కృష్ణ, నరేశ్, అశోక్, చంటి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి కోసం పోటీ

కులకచర్ల: బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవీ కోసం పోటీ నెలకొంది. ప్రస్తుతం పార్టీ మండల అధ్యక్షుడిగా శేరి రాంరెడ్డి కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి బరిలో ఐదుగురు అభ్యర్థులు కులకచర్ల మాలే కృష్ణయ్యగౌడ్, తిరుమలాపూర్ రాములు గౌడ్, ముజాహిద్‌పూర్ సారా శ్రీనివాస్, అంతారం మొగులయ్య, బొంరెడ్డిపల్లి చంద్రయ్యలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి త్వరలోనే మండల అధ్యక్షుడి పేరు ప్రకటించనున్నట్లు సమాచారం.

క్రీడల్లో రాణించాలి

పరిగి: విద్యతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని పరిగి, కులకచర్ల ఎంఈవోలు గోపాల్, హబీబ్‌లు అన్నారు. పరిగిలోని మినీస్టేడియంలో మంగళవారం త్రైకాండో జోనల్, జిల్లా స్థాయిలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అనంతయ్య, ఎండీ ఖాజా, డి.అమర్‌నాథ్, రాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆహారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

దోమ: పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆహారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పరిగి ప్రాజెక్టు అధికారిణిమేహరున్నీ, దోమ మండల సూపర్‌వైజర్ అంజమ్మలు అన్నారు. మండలంలోని గోడుగోనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో పి.మల్లేశ్వరి, గర్భిణులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోమటి ఎల్లం(35) మంగళవారం రాత్రి మేడ్చల్ చెక్‌పోస్ట్ సమీపంలోని జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్పన్‌పల్లి చెరువు ఘటనలో ఇద్దరి రిమాండ్

వికారాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పన్‌పల్లి చెరువులో పడవ బోల్తాపడి ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటనలో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జూలై 5వ తేదీన మండలంలోని సర్పన్‌పల్లి చెరువు సమీపంలో ఉన్న ది వైల్డర్ నెస్ రిసార్ట్స్‌కు ఓ కుటుంబం సరదాగా గడిపేందుకు వచ్చింది. అయితే ఆ రిసార్ట్స్ నిర్వాహకులు అనుమతులు లేకుండా బోటింగ్ నిర్వహించడమే కాకుండా లైఫ్ జాకెట్లు లేకుండా నిర్లక్ష్యంగా పర్యాటకులతో చెరువులోకి వెళ్లగా పడవ బోల్తాపడి బిహార్‌కు చెందిన రీతాకుమారి(55), పూనమ్‌సింగ్(53) అనే మహిళలు మృతిచెందారు. అప్పట్లో ఘటన వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీసులు రీసార్ట్ యాజమానితో పాటు అందులో మేనేజర్‌గా విధులు నిర్వహించిన ప్రీతమ్‌ను అరెస్ట్‌చేసి పరిగి జైలుకు తరలించారు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలోనూ ప్రస్తుత రిమాండ్ విషయం మీడియాకు తెలిపేందుకు స్థానిక పోలీసులు ఇష్టపడక పోవడం విశేషం.

హోటల్ సిబ్బందిపై దాడి.. ఇద్దరిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో హోటల్ సిబ్బందిపై దాడిచేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవుశాపూర్‌లోని యాదాద్రీ హోటల్‌లోకి అదే గ్రామానికి చెందిన కొట్టి శ్రీకర్‌రెడ్డి అలియాస్ టింకు, మణిదీప్‌రెడ్డి అలియాస్ సన్నిలతో పాటు మరో ఆరుగురు సోమవారం రాత్రి మద్యంమత్తులో ప్రవేశించి సిబ్బందిపై దాడిచేశారు. ఫర్నీచర్ ధ్వంసం చేస్తూ దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. హోటల్‌లోని కస్టమర్లను భయభ్రాంతులకు గురుచేసినట్లు తెలిపారు. హోటల్ క్యాషియర్ సిమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమతి లేకుండా ధర్నా.. 30మందిపై..

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నాచేసిన 30మందిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం. అవుశాపూర్‌కు చెందిన సయ్యద్ అమీర్(34) మృతికి నిరసనగా ఈనెల 6వ తేదీన సాయంత్రం వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై స్థానికులు ఎలాంటి అనుమతి లేకుండా ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ధర్నా నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 30మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కంటి వైద్యుడి ఆచూకీ కనిపెట్టాలి


గిరిజన సంఘం, బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న రవినాయక్

దౌల్తాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సూసైడ్‌నోట్ రాసి అదృశ్యమైన మండలంలోని బోడమర్రి తండాకు చెందిన కంటి వైద్యుడు పాత్లావత్ రమేశ్‌నాయక్ ఆచూకీ కనిపెట్టాలని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు రవినాయక్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా మద్దూర్‌లో కంటి దవాఖానా నిర్వహిస్తున్న రమేశ్‌నాయక్ 17పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి మండల కేంద్రంలో మంగళవారం ఆయన గిరిజన సంఘం, బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. రమేశ్‌నాయక్‌ను మద్దూర్ మండల కేంద్రానికి చెందిన తాజుద్దీన్ కిడ్నాప్‌చేసి మతమార్పిడికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రమేశ్‌నాయక్‌ను 48 గంటల్లో విడుదల చేయాలని, లేదంటే పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, నాయకులు నాగురావునామాజీ, సత్యయాదవ్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, రమేశ్, నర్సిములు, మదన్, సతీశ్, పూనంచంద్‌లాహోటీ, వెంకటయ్య, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

9 మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

తాండూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రవంచ గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఉదండాపూర్ గ్రామ పంచాయతీకి, ఉదండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగ ప్రసాద్‌ను కోట బాస్‌పల్లి పంచాయతీకి, యాలాల మండల రాగపూర్‌లో పనిచేస్తున్న శ్రావణ్‌ను బిజ్వర్ గ్రామ పంచాయతీకి, అల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌ను బషీరాబాద్ మండల క్యాదగిర గ్రామ పంచాయతీకి యాలాల మండల దేవనూర్ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిను చంద్రవంచ గ్రామ పంచాయతీకి డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తున్నట్లు వివరించారు.

బస్సులను పునరుద్ధరించాలి

బంట్వారం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండలంలో రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశం, రాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే డేటా ఎంట్రీ డబ్బులేవి?

బషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర సర్వే సమయంలో డేటా ఎంట్రీ చేసిన డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు పలువురు బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 11 నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వలేదని వాపోయారు.

కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తయారుచేస్తా

శామీర్‌పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేస్తానని ఆ మున్సిపల్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్ అన్నారు. ఉద్దమర్రికి చెందిన మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేశ్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మున్సిపల్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వజ్రేష్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

చౌడాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింహనాయక్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.